క్లుప్తంగా

సంకిలిలో వైద్యశిబిరం



శిబిరంలో సేవలందిస్తున్న వైద్య సిబ్బంది

రేగిడి: సంకిలి గ్రామంలో కిమ్స్, జెమ్స్ ఆస్పత్రులు సోమవారం వైద్య శిబిరం నిర్వహించాయి. శిబిరంలో 150 మందికి వివిధ వైద్య తనిఖీలు నిర్వహించ గా, 50 మందిని ఆపరేషన్లు, మెరుగైన చికిత్సల నిమిత్తం ఆస్పత్రులకు రిఫర్ చేసినట్లు డాక్టర్ మౌనికామోహన్ వెల్లడించారు. మిగిలినవారికి ఉచితంగా మందులు అందించారు. సర్పంచ్ బుడుమూరు పట్టాభి, ఆశ వర్కర్లు, ఆర్ఎంపీ వైద్యులు పాల్గొన్నారు.

రుణాలను సకాలంలో చెల్లించాలి

రేగిడి: డ్వాక్రా సంఘాల సభ్యులు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని వెలుగు ఏపీఎం గోవిందరావు సూచించారు. మండలంలోని గోపింపేట, ఖండ్యాం, అక్కన్న అగ్రహారం, తదితర గ్రామాల్లో సంఘాల మహిళలతో సోమవారం సమావేశాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ నెల క్రమం తప్పకుండా బ్యాంకు రుణాలను చెల్లించాలని, సమావేశాలు నిర్వహించుకోవాలని చెప్పారు. సంఘంలోని ప్రతీ సభ్యురాలు ఆర్థికాభివృద్ధి సాధించేలా కృషిచేయాలన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



సరసనాపల్లిలో వేతనదారులకు సూచనలు చేస్తున్న ఏపీఓ హరనాథరావు

రేగిడి: మండలంలోని సరసనాపల్లి, కాగితాపల్లి, ఏ.వి.పురం, అంబాడ, తదితర గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి పనులను ఉపాధి హామీ పథకం ఏపీఓ ఎస్. హరనాథరావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వేతనదారులతో మాట్లాడుతూ ఉపాధి సిబ్బంది ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ. 300 వేతనం వస్తుందన్నారు. ఆయన వెంట టెక్నికల్ అసిస్టెంట్ రాంబాబు, ఫీల్డ్ అసిస్టెంట్ గణపతి, మేట్లు ఉన్నారు.

83 మందికి ఉచిత సీట్లు

రాజాం సిటీ: ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశాలకు సంబంధించి నియోజకవర్గంలో 83 మందికి ఉచిత సీట్లు లభించాయని ఎంఈఓ వై.దుర్గారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో వివిధ ప్రైవేటు పాఠశాలల్లో దరఖాస్తు చేసుకున్నవారిలో రాజాంకు సంబంధించి 72 మందికి, రేగిడి మండలంలో ఒకరికి, సంతకవిటి మండలంలో పది మందికి సీట్లు వచ్చాయని తెలిపారు. ఆయా విద్యార్థుల తల్లిదండ్రుల ఫోన్ నెంబర్‌కు సీట్లు కేటాయిం చిన పాఠశాల వివరాలు వస్తాయని, లేనియెడల ఎంఈఓ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఎటువంటి ఫీజు చెల్లించాల్సిన అవసరంలేదని తెలిపారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం



ర్యాలీ చేస్తున్న వైద్యాధికారి అసిరినాయుడు, సిబ్బంది

రేగిడి: పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దరి చేరవని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి చందక అసిరినాయుడు అన్నా రు. డయేరియా నిర్మూలనపై మండల కేంద్రంతో పాటు ఆమదాలవలస గ్రామాల్లో సోమవారం అవగాహన ర్యాలీలు చేప ట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేడి,వేడి ఆహార పదార్థాలు తినాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. రోడ్డు సైడు దుకాణాల్లో విక్రయించే ఫాస్ట్ ఫుడ్‌ను తినొద్దని హెచ్చరించారు. సీహెచ్ఓ సుందరేశ్వరరావు, సూపర్‌వైజర్ కె.వి. అప్పారావు, హెచ్‌వీలు పుష్ప, జ్యోతి, ఎల్‌టీ రమణ, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లుపాల్గొన్నారు.

వరి సాగును తగ్గించడమే లక్ష్యం

బొబ్బిలి: ప్రభుత్వ ఆదేశాల మేరకు డివిజన్ పరిధిలో వరి సాగు విస్తీర్ణం తగ్గించి ఉద్యానవన పంటల సాగు విస్తీర్ణం పెంచడమే లక్ష్యంగా పని చేస్తున్నామని వ్యవసాయశాఖ ఏడీ మజ్జి శ్యామ్ సుందరరావు తెలిపారు. సాక్షితో ఆయన సోమవారం మాట్లాడారు. డివిజన్‌లో 5,230 క్వింటాళ్ల వరి విత్తనాలను పంపిణీకి సిద్ధం చేశామన్నారు. ఈ ఏడాది వరి, మొక్కజొన్న, వేరుశనగ, చెరకు, తదితర పంటలను 24,317 హెక్టార్లలో సాగు చేసేలా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఖరీఫ్‌లో 966 క్వింటాళ్ల నవధాన్యాల విత్తనాలు 50 శాతం రాయితీపై అందజేస్తామని చెప్పారు. వరి పంటను తగ్గించి ఆరుతడి పంటలు, ఉద్యాన పంటల సాగుకు రైతులు ప్రాధాన్యమివ్వాలని కోరారు.

సీసీఆర్‌సీలకు దరఖాస్తు చేసుకోండి

వంగర: కౌలు రైతులు సీసీఆర్‌సీ(పంట సాగు దారు హక్కు పత్రాలు) కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏఓ తట్టికోట కన్నబాబు సూచించారు. మరువాడ, కింజంగి గ్రామాల్లో సోమవారం గ్రామసభలు నిర్వహించారు. కౌలు రైతులకు అందించే సీసీఆర్‌సీలపై అవగాహన కల్పించారు. సీసీఆర్‌సీల కోసం కౌలు రైతులు తమ ఫొటో, ఆధార్‌కార్డు, వన్‌బీ జెరాక్సు కాపీలు అందజేయాలని చెప్పారు. ఆయా గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

చేతులెత్తేసినట్టేనా..?

- మధ్యలో నిలిచిపోయిన రాజాం రహదారి విస్తరణ
- గతంలో రూ.20 కోట్లు మంజూరు చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- గతేడాది రూ.6.80 కోట్లు విడుదల
- ఆ నిధులతో పనులు పునః ప్రారంభించిన కాంట్రాక్టర్
- ఇప్పుడేమో మిగిలిన నిధులు రాకపోవడంతో పనులు నిలుపుదల
- నిధులు విడుదలచేసుకోలేక, పనులు చేయించుకోలేక కూటమి నేతల సతాయింపు
- ప్రజలకు తప్పనిపాట్లు



అంబేడ్కర్ జంక్షన్ సమీపంలో మోర్ ఎదురుగా గుంతలో ప్రమాదకరంగా ఉన్న రోడ్డు



పాలకొండ రోడ్డులో చెక్‌పోస్టు వద్ద మధ్యలో నిలిచిపోయిన విస్తరణ పనులు

రాజాం: రాజాం పట్టణ ప్రధాన రహదారి విస్తరణ..ఎన్నో ఏళ్ల కళ. 2019 సార్వత్రిక ఎన్నికలకు ముందు ఈ రహదారి విస్తరణ పనులను అప్పట్లో టీడీపీ ప్రభుత్వం ప్రారంభించి వదిలేసింది. అనంతరం అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ రోడ్డు పక్క నిర్వాసితులను, వ్యాపారు లను ఒప్పించి రోడ్డు విస్తరణ చేయించింది. రూ. 20 కోట్లు మేర నిధులు వెచ్చించి బొబ్బిలి రోడ్డులో పైడితల్లి అమ్మ వారి గుడి నుంచి అంబేడ్కర్ జంక్షన్ మీదుగా శ్రీకాకుళం రోడ్డులోని హోండా షోరూం వరకూ బారీగా రోడ్డు విస్తరణ జరిపింది. ఈ రోడ్డు విస్తరణ చకచకా పూర్తిచేసి, రెండేళ్ల లో పట్టణ ప్రజలకు అప్పగించింది. రోడ్డు మధ్యలో స్ట్రీట్ లైన్ ఏర్పాటుతో పాటు పచ్చనిమొక్కలను వేయించి అందమైన 80 అడుగుల రోడ్డును నిర్మించి, ట్రాఫిక్ సమస్యలు తప్పించింది. అక్కడితో ఆగకుండా అటు పాలకొండ రోడ్డులో జీఎంఆర్ ఐటీ వరకూ, ఇటు చీపురుపల్లి రోడ్డులో గాయత్రీకాలనీ వరకూ రెండో విడతలో రోడ్డు విస్తరణకు రూ. 20 కోట్లు నిధులు మంజూరు చేసింది.అప్పటి రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, అప్పటి ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ విక్రాంత్ పలుమార్లు రాజాంలో సమావేశా లు నిర్వహించి, రోడ్డుకు ఇరువైపులా ఉన్న వ్యాపారులు, ఇండ్ల యజమానులను ఒప్పించి రూ.13 కోట్ల మేర నష్ట పరిహారం చెల్లించారు. మున్సిపాలిటీ నుంచి టీడీఆర్ బాండ్లు ఇప్పించారు. కోర్టు వివాదాలకు వెళ్లినవారికి నచ్చజెప్పి 80 అడుగులమేర రోడ్డును ఖాళీచేయించారు. అంతేకాకుండా రూ. 20 కోట్ల నిధుల్లో రూ.6.80 కోట్లు గతేడాది సార్వత్రిక ఎన్నికలముందు విడుదల చేసి, పనులు వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. ఆ సమయంలో రాజాం ఎన్నికల ప్రచారానికి వచ్చిన చంద్రబాబునాయుడు పాలకొండ రోడ్డులో సమావేశం పెట్టి తాము అధికారంలోకి వస్తే మూడు నెలల్లో రోడ్డు పూర్తి చేస్తామని, రాజాంకు రింగురోడ్డు వేస్తామని హామీ ఇచ్చారు. హామీ ఇచ్చి ఏడాదవుతున్నా ఇంతవరకూ ఈ రోడ్డును పూర్తి చేయలేదు. అన్ని అడ్డంకులు తొలగించి, అరటిపండు ఇచ్చినట్లు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రోడ్డు విస్తరణ అప్పగించినా, ఇంతవరకూ నిధులు విడుదలకాక రోడ్డు పనులు మధ్యలో నిలిచిపోయాయి.



బొబ్బిలి జంక్షన్‌లో నిలిచిన రోడ్డు విస్తరణ పనులు

ఎంత సతాయించినా...

కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే గత ప్రభుత్వం వేసిన టోకెన్ మేరకు రూ. 6.80 కోట్లు నిధులు కాంట్రాక్టర్ చేతికి చిక్కాయి. ఈ నిధులతో కూటమి నాయకులు కాంట్రాక్టర్‌తో పనులు వేగవంతం చేయించారు. రోడ్డు విస్తరణ పూర్తి చేయిస్తున్నామనే క్రెడిట్‌ను తమ ఖాతాలో వేసుకునేందుకు కూటమి నాయకులు పనులు పూర్తి చేసేందుకు కాంట్రాక్టర్‌ను పట్టుబట్టారు. అయితే మిగులు నిధులకు సంబం ధించిన వాటిలో కూటమి ప్రభుత్వం ఒక్క పైసా కూడా విడుదల చేయకపోవడంతో కాంట్రాక్టర్‌కు అనుమానాలు వచ్చాయి. దీంతో పనులు చేసేందుకు నిరాకరించినట్లు తెలుస్తోంది. 80శాతం మేర పనులు పూర్తి చేసిన తనకు మిగిలిన బిల్లులో 50 శాతం చెల్లింపులైనా చేస్తేనే పనులు చేస్తామని గట్టిగా పట్టుబట్టాడు. ఈ రోడ్డు విస్తరణకు ఒక్క పైసా కూడా నిధులు విడు దల చేయకుండా కాంట్రాక్టర్‌పై అధికార పార్టీ నాయకులు గట్టిగా ఒత్తిడి తెచ్చినప్పటికీ కాంట్రాక్టర్ మిగిలిన పనులు పూర్తి చేయలేదు.దీంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా తయారైంది. పలుచోట్ల రోడ్డు నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచిపోవడంతో వాహన చోదకులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కూటమి పెద్దల తో పాటు స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు. ఇదేమీ ప్రభుత్వం అంటూ నిందిస్తున్నారు. గత ప్రభుత్వం రహదారుల పనుల విషయంలో ఒక ప్రణాళిక అమలు చేసేదని, అటు సంక్షేమ పథకాలు కూడా అమలుచేసేదని, ఈ ప్రభుత్వం రాజదాని నిర్మాణం తప్ప ఇంకేమీ పట్టనట్లు వ్యవహరిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ రహదారి విస్తరణ పనుల్లో నెలకున్న ముసలంపై ఆర్‌అండ్‌బీ ఏఈ నాగభూషణ రావు వద్ద సాక్షి ప్రస్తావించగా, త్వరలో పనులు పూర్తవుతాయని, ప్రస్తుతం బిల్లులు చెల్లించే ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు.

అంతా ఆర్భాటమే..



రాజాంలో ప్రస్తుతం జరిగిన రోడ్డు విస్తరణ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చలువే. ఆ ప్రభుత్వం వేసిన టోకెన్ బిల్లులు తప్ప కొత్తగా ఏవీ విడుదల కాలేదు. కూటమి నాయకుల ఆర్భాటమే తప్ప ఈ ప్రభుత్వం రాజాం నియోజకవర్గ అభివృద్ధికి ఒక్క పైసా కూడా ఇవ్వలేదు. పలుచోట్ల రోడ్ల మరమ్మతుల పేరుతో వచ్చిన డబ్బు అంతా టీడీపీ నాయకుల జేబుల్లోకి చేరుతున్నట్లు కనిపిస్తోంది. పేదవాళ్లకు సంక్షేమ పథకాలూ అందడం లేదు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– డాక్టర్ తలే రాజేష్, వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్, రాజాం

కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

బాడంగి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ప్రిన్సిపాల్ సీహెచ్.విజయకుమారి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ గ్రూపులు ఇంగ్లిష్, తెలుగు మీడియం ఉన్నాయని పేర్కొన్నారు. కళాశాలలో చేరాలనుకునే పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు తమ దరఖాస్తులను కార్యాలయంలో సమర్పించాలని, దరఖాస్తు చేసుకునేందుకు ఈనెలాఖరువరకు గడువు ఉన్నట్టు స్పష్టం చేశారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహిస్తామని, విద్యార్థులకు ఉచితంగా పాఠ్య, నోట్ పుస్తకాలతో పాటు ఎంసెట్, నీట్ మెటీరియల్ సమకూరుస్తున్నామని, మధ్యాహ్న భోజన సౌకర్యంకూడా ఉందని పేర్కొన్నారు.

జీతం రికవరీకి ఆదేశం

బాడంగి: ఇంటింటికీ సరుకులు పంపిణీ చేయకుండా ఎండీయూ తాత్కాలిక ఆపరేటర్ పప్పల సూర్యనారాయణ తీసుకున్న 8 నెలల జీతం డబ్బులను రికవరీ చేయాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అధికారులను ఆదేశించారు. జీతం ఆపకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన సీఎస్‌డీటీని మరోసారి ఇలాంటి పొరపాట్లు దొర్లకుండా చూడాని హెచ్చరించారు. మండలంలోని పిండ్రంగివలస రేషన్‌డిపోకు చెందిన డీలర్ మానివేయడంతో 2024 మే నెల నుంచి మూడునెలల పాటు ఇంటింటికీ రేషన్ పంపిణీ కోసం అదే గ్రామానికి చెందిన పప్పల సూర్యనారాయణకు అధికారులు తాత్కాలిక బాధ్యతలు అప్పగించారు. గడువు ముగిసిన తర్వాత కూడా ఆయన జీతం డ్రా చేయడంపై అదే గ్రామానికి చెందిన రౌతుసురేష్ అనే సామాజిక కార్యకర్త కలెక్టర్‌కు ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపిన అధికారులు నిజనిర్ధారణ చేయడంతో ఆపరేటర్ డ్రా చేసిన సుమారు లక్షా 44వేల జీతం డబ్బులు రికవరీకి కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు.

‘వెన్నుపోటు దినం’ను విజయవంతం చేయండి

- 4వ తేదీన రాజాంలో నిరసన ర్యాలీ



రాజాం: ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసగిస్తున్న రాష్ట్రంలోని టీడీపీ కూటమి ప్రభుత్వం తీరుపై ఈనెల 4న నియోజకవర్గ కేంద్రం రాజాంలో వెన్నుపోటు దినం నిర్వహిస్తున్నామని వైఎస్సార్‌సీపీ రాజాం ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వెన్నుపోటు దినం నిరసన ర్యాలీలు, సభలకు నియోజకవర్గం లోని అన్ని మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఆరోజు ఉదయం 10 గంటలకు పాలకొండ రోడ్డులో సన్‌రైజ్ ఆస్ప త్రి వద్ద ర్యాలీ ప్రారంభం కానుందని వెల్లడించారు. ఈమేరకు అన్ని రకాల అనుమతులు తీసకున్నామని తెలిపారు. జిల్లాపరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ పీఏసీ మెంబర్, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ తదితరులు ఈ ర్యాలీలో పాల్గొంటారని, నియోజకవర్గంలోని బాధిత ప్రజలంతా ఈ ర్యాలీలో తమకు మద్దతుగా పాల్గొనాలని, కార్యకర్తలు ప్రతీ ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలని కోరా రు. పాలకొండ రోడ్డు నుంచి అంబేడ్కర్ జంక్షన్ మీదుగా మాధవబజార్ ఎదురుగా వైఎస్సార్ విగ్రహం వద్దకు, అక్కడి నుంచి తిరిగి అంబేడ్కర్ కూడలికి ర్యాలీ వస్తుందని, అక్కడ ప్రజలను ఉద్దేశించి ముఖ్యనాయకుల ప్రసంగం ఉంటుందని, అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి, మెమోరాండం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం

బొబ్బిలి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే విభిన్న ప్రతిభావంతులు సంక్షేమ ఫలాలు పొందారని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. సోమవారం వైఎస్సార్‌సీపీ విభిన్నప్రతిభావంతుల విభాగం జిల్లా అధ్యక్షుడు డి.కొండబాబు,కార్యవర్గ సభ్యులు బొబ్బిలి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శంబంగిని కలిశారు. విభిన్న ప్రతిభా వంతుల కొత్త కార్యవర్గం ఎన్నికలో బొబ్బిలి ప్రాతినిధ్యంపై శంబంగిని సలహాలు సూచనలు అడిగారు. కమిటీలో చోటు కల్పించేందుకు అర్హులను ఎంపిక చేయాలని, అందుకు కొన్ని పేర్లను శంబంగి కొండబాబుకు సూచించారు. వైఎస్సార్‌సీపీ హయాంలో విభిన్న ప్రతిభావంతులు పొందిన సంక్షేమ పథకాలు, డీబీటీ విధానం వంటి అంశాలపై విభిన్నప్రతిభావంతులు తమ అనుభవాలను శంబంగితో పంచుకున్నారు.కమిటీ సభ్యులు బలరాం, మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు రమ్య, గౌరి, బంగారు నాయుడు తదితరులు పాల్గొన్నారు.



శంబంగితో వైఎస్సార్‌సీపీ విభిన్న ప్రతిభావంతుల సంఘం జిల్లా కార్యవర్గం

విభజన హామీల అమలులో వైఫల్యం



ముచ్చల శ్రీనివాసరావు

బొబ్బిలి: రాష్ట్ర విభజన జరిగి 11 ఏళ్లు అయ్యిందని, కేంద్రంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం అమలు చేయాల్సి ఉందని, కానీ వాటి అమలులో బీజేపీ వైఫల్యం చెందిందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముచ్చల శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర విభజన సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాతో పాటు నిధులు, ఇతర హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిందన్నారు. వాటిని ప్రకటించిన అనంతరం కాంగ్రెస్ పార్టీ అధికారం కోల్పోయిందని, అప్పట్లో ప్రతిపక్ష హోదాలో ఉన్న బీజేపీ తాము గెలిచిన వెంటనే విభజన హామీలను అమలు చేస్తామని చెప్పారని గుర్తు చేశారు. విభజన చట్టం ప్రకారం వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి రూ.5లక్షల కోట్లు, ప్రత్యేక హోదా, ప్రత్యేక ప్యాకేజీలు ఇవ్వాల్సి ఉన్నా పట్టించుకోలేదని, కేంద్రంలో ఉన్న బీజేపీకి మద్దతుగా ఉన్న టీడీపీ ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం విభజన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

జీవామృతం తయారీపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రేగిడి: కొమెర గ్రామంలో చెరకు రైతులకు ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారం డీజీఎం కేస్ రమేష్ కుమార్ ఆధ్వర్యంలో జీవామృతం తయారీపై ప్రకృతి వ్యవసాయ ఐసీఆర్‌పీ పైల తవిటినాయుడు సోమవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా రమేష్‌కుమార్ మాట్లాడుతూ చెరకు పంటలో తెగుళ్ల నివారణకు రైతులు ఎక్కువగా పురుగుమందులు వినియోగిస్తుంటా రని, వాటికి స్వస్తిచెప్పి జీవామృతాలు పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఫ్యాక్టరీ పరిధిలోని గ్రామాల్లో రైతులు ప్రకృతి వ్యవసాయం ద్వారా చెరకు సాగుచేసేలా అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు.

కూటమి పాలనలో అన్ని వర్గాలకూ అన్యాయం

- మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

రామభద్రపురం: కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం జరుగుతోందని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు విమర్శించారు. మండలంలోని కొట్టక్కిలో జెట్పీటీసీ సభ్యురాలు అప్పికొండ సరస్వతమ్మ నివాసం వద్ద సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో చంద్రబాబుతో పాటు కూటమి నాయకులు ఎన్నో హామీలు ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క పింఛన్ పెంపు తప్ప ఇతర ఏ హామీ నెరవేర్చలేక పోయా రని, ప్రజలను మోసం చేసిన ఈ ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందని ఎద్దేవాచేశారు. విద్యార్థులకు తల్లికి వందనం,వసతి దీవెన,విదేశీ విద్యాదీవెన, రైతులకు అన్నదాత సుఖీభవ,మహిళలకు నెలకు రూ.1,500, ప్రతీ సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల నిరుద్యోగులకు భృతి అందిస్తామని ఇలా ఎన్నో హామీలు ఇచ్చి అన్నివర్గాల వారిని మోసం చేశారని మండిపడ్డారు. జగన్ సీఎంగా ఉన్న సమయంలో ప్రతీ నెల ఏదో ఒక పథకం ద్వారా అర్హులకు డబ్బులు వచ్చేవన్నారు. వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ అయిన చంద్రబాబు ప్రభుత్వంలో ప్రజలు పథకాల కోసం ఏడాదిగా ఎదురుచూస్తున్నారన్నారు.చంద్రబాబు చేసిన మోసాలను ప్రజల్లో ఎండగడతామన్నారు.మోసకారి పాలనపై ఉద్యమం ప్రారంభమైందని, ఈ క్రమంలోనే అన్ని నియోజకవర్గాల పరిధిలో ఈ నెల 4న వెన్నుపోటు దినం కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అప్పికొండ లక్ష్మునాయుడు, కొట్టక్కి సర్పంచ్ అప్పికొండ అనురాధ, ఎంపీటీసీ రమణమ్మ, పార్టీ మండల యూత్ అధ్యక్షుడు పత్తిగుళ్ల ఏక్‌నాథ్, నాయకులు ముల్లు రాంబాబు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

బొబ్బిలిరూరల్/రాజాం సిటీ/రామభద్రపురం: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో నిరుపేదలకు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు చొప్పున ఇంటి స్థలం మంజూరు చేయాలని, సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. బొబ్బిలి, రామభద్రపురం, రాజాం తహసీల్దార్ కార్యాలయాల వద్ద సీపీఐ జిల్లా నాయకుడు ఒమ్మి రమణ, జిల్లా సహాయ కార్యదర్శి అల మండ ఆనందరావు, రాజాం నియోజకవర్గ కార్యదర్శి ఉల్లాకుల నీలకంఠేశ్వరయాదవ్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా కార్యక్రమాలు చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అధికారం కోసం సూపర్ సిక్స్ పథకాలతో పాటు అనేక హామీలు ఇచ్చి ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించారని, గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో విఫలమైందని మండిపడ్డారు. గతంలో మాదిరిగానే సీఎం చంద్రబాబు మేనిఫెస్టోను మడతపెట్టి అటకెక్కించారని విమర్శించారు.విద్యార్థులు, రైతులకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించడంలో ఘోరంగా విఫలమైందన్నారు. నిరుద్యోగ యువతకు కొన్ని లక్షల ఉద్యోగాలు ఇస్తామని,లేదంటే నిరుద్యోగి భృతి ఇస్తామని చెప్పి యువతను మోసం చేశారని మండిపడ్డారు. రైతులకు ఏడాదికి రూ.20 వేలు చొప్పున పెట్టుబడి సాయం ఇస్తానని చెప్పిన చంద్రబాబు ఇప్పటికీ ఇవ్వకపోవడం మోసం కాదా అన్నారు.ఏడాది కాలంలో పింఛన్ల పెంపు తప్ప ఈ ప్రభుత్వం చేసిందేమి లేదని, కాలయాపనతో పాలన సాగిస్తున్నారని విమర్శించారు. ఇళ్ల స్థలాలు ఇవ్వడంతోపాటు ఇంటి నిర్మాణానికి రూ. 5లక్షలు ఇవ్వాలన్నారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకుంటే ప్రస్తుత పాలకులను ఇంటికి పంపే వరకు పోరాటాలు చేయడానికి వెనుకాడబోమన్నారు. గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.అనంతరం తహసీల్దార్‌లకు వినతిపత్రాలు అందజేశారు.సీపీఐ నాయకులు కోట అప్పన్న,ఎండదొర, శ్రీనివాస్, సింగారపు కనకరాజు, జామి అప్పారావు, గుండెల చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.



రామభద్రపురం: ధర్నా చేస్తున్న సీపీఐ జిల్లా సహాయకార్యదర్శి ఆనందరావు, తదితరులు



బొబ్బిలిరూరల్: ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు



రాజాం సిటీ: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

‘వెన్నుపోటు దినం’ పోస్టర్ల ఆవిష్కరణ

రామభద్రపురం:

కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిన మోసాలను నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈనెల 4న నిర్వహించనున్న ‘వెన్నుపోటు దినం’ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు,ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు నాయకులతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మణరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయినా ఒక్క సంక్షేమ పథకం అమలు చేయ లేదని విమర్శించారు.

జూన్ 4వ తేదీని ప్రజలకు చంద్రబాబు వెన్నుపోటు పొడిచిన దినంగా వైఎస్సార్‌సీపీ ప్రకటించిందన్నారు. బొబ్బిలిలో నిర్వహించనున్న వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాలకు పెద్ద సంఖ్యలో నాయకులు, ప్రజాప్రతినిధులు,అభిమానులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ లక్ష్మణరావు, నాయుకులు

తరలిరావాలి...

బాడంగి: ‘వెన్నుపోటు దినం’ కార్యక్రమంలో భాగంగా ఈనెల4న బొబ్బిలిలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమాలకు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు యామలి శివప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన సాక్షితో మాట్లాడారు. ఎన్నికల సమయంలో చంద్రబాబుతో పాటు కూటమి నేతలు సూపర్ సిక్స్ పథకాలతో పాటు ఇతర హామీలు ఇచ్చారని, అధికారంలోకి వచ్చి ఏడాదికావస్తున్న ఒక్క హామీని నెర వేర్చలేకపోయారని విమర్శించారు. సీఎం చంద్రబాబు ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. రెడ్‌బుక్ రాజ్యాంగంతో ప్రశ్నించే గొంతులను భయపెట్టి, అక్రమకేసులతో అణగదొక్కాలని ప్రభుత్వం చూస్తోందని ఆరోపించారు. ఎంత భయపెట్టినా ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటాలు తప్పవన్నారు.

రెండో రోజూ అదే తీరు...

బొబ్బిలి: ఇంటింటికీ రేషన్ సరుకులు అందించే వ్యవస్థను రద్దు చేసి ఆదివారం నుంచి రేషన్ దుకాణాల్లో సరుకుల పంపిణీ ప్రారంభించిన కూటమి ప్రభుత్వం ఆ వ్యవస్థపై పర్యవేక్షణ గాలికొదిలేసింది. రేషన్ డీలర్లు మర్యాదగానే ప్రవర్తిస్తున్నారా అని సర్వే చేస్తున్నామని ప్రకటించుకున్న రాష్ట్ర ప్రభుత్వం అది నిజంగా అమలు అవుతుందా లేదానని మాత్రం చూడడం లేదు. బొబ్బిలి పట్టణంలోని 311 రేషన్ డిపో వద్ద సరుకులు ఇస్తారని ఉదయం 9 గంటలకు వచ్చి కూర్చున్నప్పటికీ సరుకులు మాత్రం ఇవ్వలేదు. దీంతో మహిళలు గత ప్రభుత్వం హయాంలో ఇళ్ల వద్దకు వచ్చి బియ్యం, సరుకులు ఇచ్చేవారని, ఇప్పుడు ఎండలో ఇంత దూరం వచ్చినా పట్టించుకునే వారు లేరని ఆరోపించారు. ఇంతలో అక్కడికి వచ్చిన డీలర్ కె.నిర్మలాకుమారి లబ్ధిదారులపై చిర్రెత్తిపోయారు. ‘‘ఏం వారం రోజుల పాటు ఇస్తాం కదా..? ఆమాత్రం ఓపిక లేదా..? ఉండలేకపోతున్నారా..?ఇది పద్ధతి కాదని’’ లబ్ధిదారులను హెచ్చరిస్తూ మాట్లాడారు. కనీస గౌరవం ఇవ్వకుండా రేషన్ డిపో తన సొంత జాగీరులా మాట్లాడడంతో అక్కడి మహిళలు నివ్వెరపోయారు. మరోపక్క పాత బొబ్బిలిలోని 302 నెంబర్ షాపు తెరిచి వెంటనే మూసేశారు. ఉదయం పదిన్నర గంటలకే రేషన్ షాపు మూసేయడంతో లబ్ధిదారులు వచ్చి వెనుదిరిగారు. ఈ రేషన్ షాపు డీలర్ నారంశెట్టి శివ ప్రసాదరావు పట్టణంలోని ఓ నగల దుకాణంలో పనిచేస్తుండడంతో అక్కడకు వెళ్లిపోతారని తిరిగి రేపు పెందలాడే వచ్చి వేళ మీదే షాపు మూసేస్తారని స్థానికులు చెప్పుకుని ఆవేదన చెందారు. మొత్తానికి కూటమి ప్రభుత్వంలో లబ్ధిదారులకు ఇక్కట్లు తప్పడం లేదని స్థానికులు మండిపడుతున్నారు.



లబ్ధిదారులపై కసురుకుంటున్న బొబ్బిలిలోని 311 డిపో మహిళా డీలర్ నిర్మలాకుమారి



పదిన్నర గంటలకే మూత పడి ఉన్న పాత బొబ్బిలి 305 నెంబర్ రేషన్ షాపు